# పార్టీలు ప్రవర్తనా నియమావళిని పాటించాలి

- ఎమ్మెల్యే అభ్యర్థులకు రూ. 40 లక్షల వ్యయ పరిమితి
- ప్రచార అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు టౌన్, అక్టోబర్ 18 : ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డీఎస్ వెంకన్నతో కలసి గుర్తింపు పొందిన పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ఖర్చులు, నియమావళిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడొద్దన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలపాలన్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఉల్లంఘనలు, సందేహాలుంటే సంప్రదించాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా ముందు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. అభ్యర్థికి రూ. 40 లక్షల వరకు వ్యయ పరిమితి ఉందని, ప్రత్యేక బ్యాంక్ అకౌంట్ తీసి అందులో నుంచే ఖర్చు చేయాలని అన్నారు. ఎన్నికల ఖర్చుల పుస్తకాన్ని నిర్వహించి బ్యాంకు లావాదేవీలను నమోదు చేయాలన్నారు. రిటరర్నింగ్ అధికారి కార్యాలయంలోని సహాయ ఎన్నికల పరిశీలకులు షాడో రిజిస్టర్లో నమోదు చేస్తున్న లెక్కలతో సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం కలెక్టరేట్‌లోని సువిధ సెల్‌కు లిఖిత పూర్వకంగా కనీసం 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అన్ని అనుమతులు సువిధ ద్వారానే జరుగుతాయన్నారు. కోడ్ అతిక్రమించినట్లు సమాచారం ఉంటే అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలతో సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రచార ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

## ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

ములుగు టౌన్, అక్టోబర్ 18 : ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో రిటర్నింగ్ ఆఫీసర్, ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి శాసనసభ ఎన్నికల ముందు రోజు, పోలింగ్ రోజు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కోసం సిబ్బందిని నియమించడంతో పాటు వారి విధులకు సంబంధించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల ముందు రోజు సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో బస చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్న, ఆర్డీవో కే సత్యపాల్ రెడ్డి, డీఆర్డీవో నాగ పద్మజ, జడ్పీ సీఈవో ప్రసూనారాణి, డీపీవో వెంకయ్య, కలెక్టరేట్ ఏవో ప్రసాద్, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, ఎన్నికల విభాగం తహసీల్దార్ సంధ్యారాణి, విజయ్ కుమార్, అనిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి అంకిత్

## ప్రచార సామగ్రి ముద్రణకు అనుమతి తప్పనిసరి

- ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్

ములుగు టౌన్, అక్టోబర్ 18 : ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ప్రచార సామగ్రి ముద్రణకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డీఎస్ వెంకన్నతో కలిసి ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోటీ చేసే అభ్యర్థులు ప్రింటింగ్ చేయించే ప్రచార సామగ్రి, ఫ్లెక్సీల కోసం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ద్వారా ముందస్తు అనుమతి పొందాలన్నారు. ప్రచార సామగ్రిపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా, సెల్ నంబర్, ప్రచురణల సంఖ్య, ప్రచురించే అభ్యర్థి పేరు తదితర వివరాలు ప్రచురించాలని సూచించారు. ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో విజయభాస్కర్, తహసీల్దార్ సంధ్యారాణి, విజయ్ కుమార్, అనిస్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ విజయం ఖాయం

- నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- కార్యకర్తలు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మూడు మండలాల ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్

కన్నాయిగూడెం, అక్టోబర్ 18 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమైందని, ములుగులో బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మూడు మండలాల ఎన్నికల ఇన్‌చార్జి మెట్టు శ్రీనివాస్ అన్నారు. బుధవారం లక్ష్మీపురంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్యతో కలిసి హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలన్నారు. గ్రామస్థాయిలో, బూత్ లెవల్లో పని చేసే కార్యకర్తలతోనే బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని తెలిపారు. ఎన్నికల్లో ఒకరికొకరు సమన్వయం చేసుకుంటూ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, చిన్ని కృష్ణ, తిరుపతి, వెంకటయ్య, రాంబాబు, సుధాకర్, శోభన్, ఉమామహేశ్వరి, ప్రభాకర్, అశోక్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మెట్టు శ్రీనివాస్


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి

## బీఆర్ఎస్‌లో చేరిన వడ్డెర సంఘం నాయకులు

మంగపేట, అక్టోబర్ 18 : మండలంలోని కమలాపురానికి చెందిన వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న, నాయకులు తురక శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల వీరబాబు, జిల్లా కోశాధికారి చల్లా శ్రీను, వేముల లక్ష్మయ్య, మంజుల కృష్ణ తదితరులు బుధవారం బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, రోడ్లు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాకులమర్రి, మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ములుగు ఎమ్మెల్యేగా బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలనే లక్ష్యంతో పార్టీని బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏటూరునాగారం మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, ఎంపీపీ అంతటి విజయానాగరాజు, నూతి కృష్ణమూర్తి, వలీబాబా, దడిగల సమ్మయ్య, రవీందర్, కాకులమర్రి ప్రదీప్ రావు, యలవర్తి శ్రీనివాసరావు, జబ్బ సమ్మయ్య, కావిరి సంతోష్, సయ్యద్ సర్దార్ పాషా, ఎంపీటీసీ కోట నరసింహులు, కుమ్మరి స్వప్నా చంద్రబాబు, శివాలయం చైర్మన్ తాడూరి రఘు, జాడి భోజారావు, రంజిత్, సారయ్య, శ్రీరాములు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన

ములుగు రూరల్, అక్టోబర్ 18 : ములుగు జిల్లా కేంద్రంతో పాటు మండలంలోని బరిగలానిపల్లి, ఇంచర్ల, జీవంతరావుపల్లి, బండారుపల్లి గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ బుధవాం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో చేపడుతున్న చర్యలపై రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల సందర్భంగా ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని వేణుగోపాల్ సిబ్బందికి సూచించారు.


ములుగులోని పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న వేణుగోపాల్


## పీహెచ్‌సీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

వాజేడు, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం వైద్యాధికారి కొమురం మహేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చిన అనంతరం ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఏంపీడీవో విజయ, ఏంపీవో శ్రీకాంత్‌నాయుడు, వైద్యాధికారులు జ్ఞానస, మధుకర్, హెల్త్ సూపర్‌వైజర్లు కోటిరెడ్డి, వెంకటరమణ, స్టాఫ్ నర్సులు స్రవంతి, నాగలక్ష్మి, ఏఎన్ఎంలు లలితాకుమారి, ఛాయాదేవి, రాజేశ్వరి, కన్యాకుమారి, ఆశ కార్యకర్తలు జ్యోతి, సరిత, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న వైద్య సిబ్బంది

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మంగపేట, అక్టోబర్ 18 : మండలంలోని వాగొడ్డుగూడెంకు చెందిన గట్టిపల్లి రాజేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం శ్రీరామకృష్ణ ట్రస్ట్ చైర్మన్ బాడిశ నాగరమేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో సభ్యులు బాడిశ ఆది, బాడిశ నవీన్, ఇందారపు రమేశ్, మునిగాల మహేశ్, కొమరం నితిన్, కొమరం శివాజీ, బాబు, గ్రామస్తులు బొగ్గుల కృష్ణమూర్తి, కొమరం ఈశ్వరమ్మ, గట్టుపల్లి శీను, గట్టుపల్లి అర్జున్, గట్టుపల్లి నాని, దబ్బగట్ల బాబు, సున్నం వంశీ, వజీర్, గట్టిపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నాగరమేశ్

## అన్నపూర్ణాదేవిగా దుర్గామాత

గోవిందరావుపేట, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి వేడుకలు బుధవారం 4వ రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆచార్యులు డింగరి సునీల్, అజిత్‌స్వామి గాయత్రి, నాగదోష హోమాలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు